సాక్షి
అనంతపురం
శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
35.4°/22.6°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

రూ. 2 వేల నోట్ల మార్పునకు రేపే చివరి అవకాశం



హిందూపురం అర్బన్: రూ.2 వేల నోట్లు మార్చుకునేందుకు రేపు ఒక్క రోజే గడువు మిగిలింది. 2,000 నోటు చెల్లుబాటుకు ఈ నెల 30ని డెడ్‌లైన్‌గా రిజర్వుబ్యాంకు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇంకా ఎవరి వద్దనైనా రూ.2 వేల నోట్లు ఉంటే వెంటనే మార్చుకోవాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంకుల్లో మార్చుకున్నారు. ఈ ఏడాది మే 19న రూ.2 వేల నోట్లు రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.

జిల్లాకు 1,334 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ కోటా కింద ఫ్యాక్ట్ కంపెనీకి చెందిన 1,334 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు చేరాయి. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో రేక్ పాయింట్ వద్ద ఏడీఏ ఎం.రవి గురువారం ఎరువులను పరిశీలించారు. ఫ్యాక్ట్ కంపెనీ నుంచి 962 మెట్రిక్ టన్నులు 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులతో పాటు 372 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్ వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ఆర్బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు వెల్లడించారు.

ఎద్దులపల్లి పీహెచ్‌సీకి జాతీయ స్థాయి గుర్తింపు



ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లు ఆస్పత్రి వైద్యాధికారి అనిల్ కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 14,15 తేదీల్లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం ఆస్పత్రిని పరిశీలించింది. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలకు 89.14 శాతం మార్కులు ఇచ్చింది. దీంతో సేవల పరంగా జాతీయ స్థాయిలో ఆస్పత్రికి రెండో స్థానం లభించినట్లు వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందికి ఆయనతో పాటు వైద్యులు సుధాకర్, మనీషా కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్కో రైతుకు రెండు క్వింటాళ్ల పప్పుశనగ



విత్తన పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: అక్టోబర్ నుంచి ప్రారంభం కానున్న రబీలో పప్పుశనగ సాగు చేసే రైతులకు ఈ సారి గరిష్టంగా 200 కిలోల విత్తనాలు పంపిణీ చేయనున్నారు. గతంలో 25 శాతం సబ్సిడీతో ఒక్కో రైతుకు గరిష్టంగా 125 కిలోల విత్తనం అందజేసేవారు. అయితే ఈ సారి రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 40 శాతం రాయితీతో గరిష్టంగా రెండు క్వింటాళ్లు ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇప్పటికే నల్లరేగడి భూములు కలిగిన 21 మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. క్వింటా పప్పుశనగ ధర రూ.8,100 కాగా, రాయితీ రూ.3,240 పోనూ రైతులు తమ వాటా కింద రూ.4,860 చెల్లించాల్సి ఉంటుంది. ఎకరం ఉన్న రైతులకు 20 కిలోలు కలిగిన రెండు బస్తాలు, 5 ఎకరాలకు 10 బస్తాలు ఇస్తారు. రైతులు వెంటనే ఆర్బీకేల్లో సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకుంటే వచ్చే వారంలో పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు.



❒ నెల రోజుల క్రితం కదిరికి చెందిన డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు ఇంట్లో కుప్పకూలి పోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళితే హార్ట్‌ఎటాక్ అని తేలింది. ఇంత చిన్న వయసులో గుండెపోటు రావడమేమిటని వైద్యులే ఆశ్చర్యపోవాల్సి వచ్చింది.

❒ వారం రోజుల క్రితం అనంతపురానికి చెందిన 33 ఏళ్ల ఐటీ ఉద్యోగి గుండె నొప్పిగా ఉందని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఇంతలోనే సమస్య తీవ్రమైంది. చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. కారణమేమంటే తీవ్రమైన గుండె పోటు అని వైద్యులు చెప్పారు.



హృదయ వేదన విందాం!

- పెరుగుతున్న హార్ట్ ఎటాక్ బాధితులు
- చిన్న వయసులోనే గుండెపోటు బారిన పడుతున్న వైనం
- ఆరోగ్యశ్రీలో గుండె జబ్బులకే 30 శాతం ప్రభుత్వ వ్యయం
- సమతుల ఆహారం తీసుకోక, వ్యాయామం లేక ఆరోగ్యానికి చేటు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జీవన శైలి మార్పులు, ఆహార సమతుల్యత పాటించకపోవడం వెరసి గుండెకు పెనుముప్పు తెచ్చిపెడుతున్నాయి. గుండె జబ్బు ఒక్కసారే వచ్చి పడేది కాదు. అంతకుముందు ఎన్నో సంకేతాలు చిట్టి గుండె నుంచి వస్తూ ఉంటాయి. జాగ్రత్త పడమని సూచిస్తుంటాయి. అయితే, వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం చేటు తెస్తోంది. చివరికి ప్రాణాలూ తోడేస్తోంది. రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో 3 వేల పైగా జబ్బులకు రూ.450 కోట్లు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఖర్చు చేస్తే, అందులో రూ.129 కోట్లు పైగా గుండెజబ్బులకే కేటాయించడం చూస్తే పరిస్థితి తీవ్రతను అంచనా వేయచ్చు.

పల్లెలకూ పాకిన మాయదారి జబ్బు..

ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా గుండె పోటు కేసులు వచ్చేవి. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ జీవనశైలి జబ్బులు ఎగబాకడం విస్మయం కలిగిస్తోంది. ప్రస్తుతం ప్రతి పది

సందర్భం నేడు వరల్డ్ హార్ట్ డే

మందిలో ఒకరు గుండె సంబంధిత సమస్యను ఎదుర్కొంటున్నట్టు ఇండియన్ కార్డియాలజీ సొసైటీ ఇటీవల హెచ్చరించింది. జాగ్రత్తలు పాటించడంలో కనబరిచే నిర్లక్ష్యమే శాపమవుతోందని స్పష్టం చేసింది.

యువకుల్లోనూ..

ఒకప్పుడు 55 ఏళ్లు దాటితేగానీ గుండె సంబంధిత జబ్బులొచ్చేవి కావు. కానీ నేడు 35 ఏళ్లకే గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. గుండెపోటును సైలెంట్ కిల్లర్‌గా వైద్యులు అభివర్ణిస్తున్నారు. గుండె పోటుకు రకరకాల కారణాలు చుట్టుముడుతున్నాయి. మధుమేహం, రక్తపోటు వంటివి కూడా ఆజ్యం పోస్తున్నట్టు హృద్రోగ నిపుణులు పేర్కొంటున్నారు.

గుండె జబ్బులకు ప్రధాన కారణం..

- పొగాకు, ఆల్కహాల్ విపరీతంగా తీసుకోవడం
- అధిక రక్తపోటు ఉంటే, నియంత్రణలో ఉంచుకోలేకపోవడం
- చెడు కొలెస్ట్రాల్ అంటే ఎల్‌డీఎల్ (లో డెన్సిటీ లిపిడ్స్) ఉండటం
- శరీరంలో ఉండాల్సిన దానికంటే ఎక్కువ నూనెల (ట్రైగ్లిజరాయిడ్స్) శాతం
- వయసుకు, ఎత్తుకు మించి బరువు (ఊబకాయం)
- మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడంలో నిర్లక్ష్యం
- కుటుంబ చరిత్ర ప్రభావం

కాపాడుకోవాలి ఇలా

- రోజూ 40 నిముషాలకు తగ్గకుండా వ్యాయామం.
- కొవ్వులున్న ఆహారం తగ్గించి పీచు ఆహారం ఎక్కువగా తీసుకోవడం (కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, చిరు ధాన్యాలు)
- బరువును అదుపులో ఉంచుకోవడం. ఒత్తిడి తగ్గించుకోవడం
- ఆరుమాసాలకోసారి 2డీ ఎకో వంటివి చేయించడం
- చెడు కొలెస్ట్రాల్‌ను గుర్తించేందుకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించడం
- బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవడం

వ్యాయామమే శ్రీరామరక్ష



గుండెజబ్బుల రాకుండా ఉండాలంటే రోజూ 40 నిముషాల నడక లేదా జాగింగ్, స్విమ్మింగ్ చేయాలి. కూల్‌డ్రింక్స్ తీసుకోకూడదు. రోజుకు 3 గ్రాములకు మించి ఉప్పు, నెలకు 500 మిల్లీ లీటర్ల మించి ఆయిల్ వాడకూడదు. ముఖ్యంగా పదే పదే మరిగించిన నూనెతో చేసినవి తింటే గుండెకు ఎక్కువ ముప్పు ఉంటుంది. పొగతాగడం, మద్యం అనేవి ఎప్పుడూ గుండెకు శత్రువులే.

–డాక్టర్ వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకంలో గుండె జబ్బుల చికిత్స వివరాలు, వ్యయం.. (2019 జూన్- 2023 సెప్టెంబర్ 28)

కార్డియాక్ అండ్ థొరాసిక్ సర్జరీలు	10,621
ప్రభుత్వం వ్యయం	రూ.65.75 కోట్లు
కార్డియాలజీ చికిత్సలు (స్టంట్ వంటివి)	18,276
ప్రభుత్వ వ్యయం	రూ.63.68 కోట్లు
హార్ట్ ఆపరేషన్లు	28,897
చేసిన వ్యయం	రూ.129.34 కోట్లు

ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం



ప్రస్తుత రోజుల్లో చిన్న వయసు వారికీ గుండె సమస్యలు తలెత్తుతున్నాయి. జంక్ ఫుడ్, మద్యం, ధూమపానంతోనే సమస్యలు తెచ్చుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీలో కార్పొరేట్ స్థాయిలో హృద్రోగులకు సేవలు అందిస్తున్నాం. అటువంటి శస్త్రచికిత్సలు ప్రైవేట్‌గా చేసుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాలి. ఇప్పటి వరకూ దాదాపు 400 వరకు ఆంజియోప్లాస్టీ,యాంజోగ్రామ్ ఆపరేషన్లు విజయవంతంగా చేశాం.

– డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, కార్డియాలజిస్టు

మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా



జాషువా చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సాహిత్యకారుడు గుర్రం జాషువా మహోన్నత వ్యక్తి అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కొనియాడారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా గొప్ప రచయిత, కవి, సాహితీకారుడన్నారు. రుక్మిణి కల్యాణం, కోకిల, ధ్రువ విజయం, గబ్బిలం, ఫిరదౌసి, ఖండ కావ్యాలు, తదితర రచనలు ఆయన కలం నుంచి వెలువడ్డాయన్నారు. కవితా విశారద, కవి కోకిల, నవయుగ చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ బిరుదులు పొందారన్నారు. కడుపేద కుటుంబం నుంచి వచ్చినా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మహనీయుడన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, విభాగాల సూపరింటెండెంట్‌లు పుణ్యవతి, ఈశ్వరయ్యశెట్టి, సిబ్బంది చెన్నకేశవులు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో వెయిటింగ్ విద్యార్థుల జాబితా విడుదల

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వెయిటింగ్ విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. వెయిటింగ్ విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ-1000177, ఈ-1004439, బి-1000055, బి-1000140, సి-1001360, సి-1005501, ఐ-1000472, ఐ-1002414, పి-1001090, ఎం-1002901, జే-1005292, జే-1005578, జే-1003279, ఎస్-1008046, కే-1007151, ఎల్-1002056.

ప్రజాప్రతినిధులను భాగస్వాముల్ని చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల నిర్వహణపై సమీక్ష



అనంతపురం అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాముల్ని చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. జిల్లాలోని 34 గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న వైద్య శిబిరాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి డీఎంహెచ్ఓ, ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్స్ పాటించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి పాల్గొనేలా చూడాలన్నారు. క్యాంపు ప్రారంభం కంటే ముందే ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. క్యాంపులో ఆరోగ్య శ్రీ సేవల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య శ్రీ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ అయ్యిందా లేదా పరిశీలించాలన్నారు. యూహెచ్ఐడీ కార్డుతో లాగిన్ చేయడం, ఆరోగ్య శ్రీ కొత్తకార్డు లేదా ఉన్న కార్డులో లోపాలు ఉంటే సరిదిద్దాలని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేద్దాం.. చేయిద్దాం

'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు జిల్లావ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో 'ఏక్ దిన్ ఏక్ గంట' కార్యక్రమం కింద శ్రమదానం చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక బృందాలు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత, యూత్ క్లబ్‌లు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో ముఖ్యమైన ప్రదేశాల్లోని చెత్త తొలగించాలన్నారు. మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాల్లో ఏసీబీఎం వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. స్వచ్ఛత క్విజ్‌లు, ప్లాంటేషన్ డ్రైవ్‌లు, స్వచ్ఛతా ప్రతిజ్ఞలు, స్వచ్ఛతా రన్ నిర్వహించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు, కంపోస్ట్ పిట్స్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, వాహనాల బ్రాండింగ్, పెయిటింగ్, ఆస్తుల మరమ్మతులు చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు ఈనెల 30న ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు నిర్వహించి స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించాలని జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ సూచించారు.

హిమాచల్‌పై ఆంధ్రప్రదేశ్ విజయం



హిమాచల్ ప్రదేశ్ - ఆంధ్రప్రదేశ్ మధ్య మ్యాచ్

అనంతపురం: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) సబ్ జూనియర్ బాలుర జాతీయ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ శుభారంభం చేసింది. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో మూడు రోజులుగా మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం ఆంధ్రప్రదేశ్- హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-0తో ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు మనోజ్ హిమాచల్ ప్రదేశ్ కీపర్‌ను బోల్తా కొట్టించి గోల్ చేశాడు. ఇక తమిళనాడు- ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-0తో తమిళనాడు, అస్సాం- లక్షద్వీప్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 8-1తో అస్సాం జయభేరి మోగించింది. బిహార్ - అండమాన్ నికోబార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. బిహార్ 13-0తో ఘన విజయం సాధించింది.

నేడు వైఎస్సార్ వాహన మిత్ర సాయం విడుదల

అనంతపురం సెంట్రల్: ఆటో, మ్యాక్సీ డ్రైవర్లకు వరుసగా ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్రైవర్ల ఖాతాల్లోకి బటన్‌నొక్కి ఆర్థిక సాయం జమ చేయనున్నారు. జిల్లాలో 8,806 మందికి రూ. 8.80 కోట్ల ఆర్థికసాయం అందజేస్తున్నట్లు డీటీసీ వీర్రాజు వెల్లడించారు. 2019-20 లో 11,301 మందికి రూ. 11.3 కోట్లు, 2020-21లో 13,207 మందికి రూ. 13.21 కోట్లు, 2021-22లో 12,744 మందికి రూ. 12.74 కోట్లు, 2022-23లో 8,093 మందికి రూ. 8.09 కోట్లు బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు ఆయన వివరించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం ఏ రాష్ట్రంలో కూడా లేదన్నారు.

● భక్తిశ్రద్ధలతో మిలాదున్నబీ



అనంతపురంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



దర్శనానికి ఉంచిన మహ్మద్ ప్రవక్త కేశం



శాంతి ర్యాలీలో ముస్లిం పిల్లల సాంస్కృతిక ప్రదర్శన

మహ్మద్ ప్రవక్త (స) జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మిలాదున్నబీ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మసీదులు, దర్గాలు కిటకిటలాడాయి. సామూహిక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన శాంతి ర్యాలీల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. సాయంత్రం ప్రవక్త కేశ దర్శనం చేసుకున్నారు. ఆయన ప్రవచనాలను ఆచరిస్తూ లోక కల్యాణానికి పాటు పడదామని మతపెద్దలు పిలుపునిచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ఏర్పాట్లు పూర్తి

రాప్తాడురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 30 నుంచి చేపట్టనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యకమానికి సంబంధించి జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెల 30 వరకు జిల్లా వ్యాప్తంగా 28 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 28 విలేజ్ హెల్త్ సెంటర్లు, 6 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 6 ప్రాంతాల హెల్త్ సెంటర్లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయను న్నామన్నారు. ఒక్కో వైద్య శిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు సాధారణ డాక్టర్లతోపాటు ఇతర పారామెడికల్ సిబ్బంది వైద్య సేవలు అందిస్తారన్నారు. మొత్తం 68 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 68 మంది సాధారణ వైద్యులు పాల్గొంటారన్నారు.

నేడు కంబదూరులో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: కంబదూరులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

పంట సంజీవని పరికరాల పరిశీలన

గుంతకల్లు రూరల్: పంట సంజీవని పథకం కింద 2016లో వ్యవసాయ శాఖ ద్వారా అప్పటి ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన పరికరాలు ఎక్కడున్నాయనే అంశంపై అధికారిక విచారణ మొదలైంది. జిల్లా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం గురువారం గుంతకల్లు మండలం తిమ్మాపురం, నల్లదాసరపల్లి, నెలగొండ, మల్లేనిపల్లి, కసాపురం, దోసలుడుకి, గుండాల, గుండాల తండా తదితర గ్రామాల్లో పర్యటించింది. 2016లో రైతులకు రెయిన్ గన్లు, స్ప్రింక్లర్లు, డీజిల్ ఇంజన్లు, పైపులను అప్పటి టీడీపీ ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ పనిముట్లు రైతుల వద్ద ఎంత మేరకు ఉన్నాయో పరిశీలించారు. వాటి వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ మద్దిలేటి, ఏఓ ప్రతాప్‌తో కూడిన ప్రత్యేక బృందంతో పాటు ఉరవకొండ ఏడీఏ పద్మజ, గుంతకల్లు ఏఓ స్వాతి పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: స్థానిక మార్కెట్ యార్డు వెనుక మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. పట్టుబడిన వారిలో బింగి రమేష్, చాకలి కొండయ్య, వేల్పుల శ్రీరాములు, దూదేకుల సిద్ధిక్‌బాషా ఉన్నారు. నిందితుల నుంచి రూ.92,670 నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు 'మేరా మాటీ.. మేరా దేశ్'

- అన్ని పాఠశాలల్లో స్ఫూర్తిదాయక కార్యక్రమాల నిర్వహణ
- ఏ ఒక్క స్కూల్‌కు లోకల్ హాలిడే లేదన్న డీఈఓ
- ఇంటర్ విద్యార్థులకూ అవగాహన కల్పించేలా చర్యలు
- వీరగాథ-3లో పాల్గొన్న 65,729 మంది జిల్లా విద్యార్థులు


వీరగాథ-3 కార్యక్రమంలో పాల్గొన్న శెట్టూరు కేజీబీవీ విద్యార్థినులు

రాప్తాడు రూరల్: విద్యార్థి దశ నుంచే పిల్లల్లో దేశ భక్తి రగిల్చేలా ఈ విద్యా సంవత్సరం (2023–24)'వీరగాథ–3.0' కార్యక్రమానికి కేంద్ర విద్య, రక్షణ మంత్రిత్వ శాఖలు శ్రీకారం చుట్టాయి. మరో వైపు అమరవీరులను గౌరవించుకునేందుకు 'మేరా మాటీ – మేరా దేశ్' కార్యక్రమం అమలుకూ పూనుకుంది. వీరగాథ–3.0 కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం ద్వారా గ్యాలంట్రీ పురస్కారాలు పొందిన వీరుల త్యాగాలు, శౌర్యప్రతాపాలు కనబరిచిన వీరుల ధైర్య సాహసాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు విస్తృతం చేశారు. ఈ క్రమంలో 3 వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకూ పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన తదితర అంశాలపై ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని పోటీలో పాల్గొనవచ్చు. దేశం కోసం త్యాగం చేసిన వారిని ఆదర్శంగా ఎంచుకుని వారు అందుకున్న అవార్డులు, వారి నుంచి తాము నేర్చుకున్న అంశాలను ప్రస్తావించాలి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న దేశభక్తి, సామాజిక స్పృహకు మరింత పదును పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్, ఇంటర్ విద్యార్థులు ఇందులో పాలుపంచుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి విజేతలకు రానున్న రిపబ్లిక్ డే(జనవరి 26)నాడు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఆయా తరగతుల వారీగా విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి పోటీలను నిర్వహిస్తున్నారు. మొదటి కేటగిరీలో 3, 4, 5 తరగతులు, రెండో కేటగిరీలో 6, 7, 8 తరగతులు, మూడో కేటగిరీలో 9, 10 తరగతులు, నాల్గో కేటగిరీలో 11, 12 తరగతుల విద్యార్థులు ఉంటారు.

ఏపీదే అగ్రస్థానం

వీరగాథ–3 కార్యక్రమం అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 10,82,118 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన 65,729 మంది విద్యార్థులున్నారు.

నేడు అన్ని పాఠశాలల్లోనూ...

అమర జవాన్లు, దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు ఏర్పాటు చేసిన 'మేరా మాటీ – మేరా దేశ్' కార్యక్రమం శుక్రవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ విధిగా చేపడుతున్నారు. ఇప్పటికే ప్రతి పంచాయతీల్లోనూ అమర వీరుల జ్ఞాపకార్థం స్మారకాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో దేశభక్తి రగిల్చేందుకు పలు కార్యక్రమాలను చేపట్టేలా విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

కచ్చితంగా జరపాల్సిందే



'మేరా మాటీ – మేరా దేశ్' కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని యాజమాన్యాల స్కూళ్లలో శుక్రవారం విధిగా జరపాలి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏ ఒక్క స్కూలూ లోకల్ హాలిడే ప్రకటించకూడదు. విధిగా పాఠశాలకు హాజరై ఈ కార్యక్రమాన్ని జరిపి సంబంధిత ఫొటోలను విద్యాశాఖకు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. – వి.నాగరాజు డీఈఓ

ధాబాల్లో సెబ్ అధికారుల తనిఖీలు


ధాబా నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న సెబ్ సీఐ విజయ్‌కుమార్

తాడిపత్రి అర్బన్: సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని పలు ధాబాల్లో సెబ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రూరల్ పరిధిలోని ఫ్రెండ్స్ ధాబాలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల తాడిపత్రి ప్రాంతంలోని ధాబాల్లో అక్రమంగా మద్యం విక్రయించడంతో పాటు తాగేందుకూ అవకాశం కల్పిస్తున్నారన్న పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ధాబాల్లో మద్యం విక్రయాలు సాగిస్తూ సేవించడానికి అనుమతిస్తే సీజ్ చేస్తామని నిర్వాహకులకు జారీ చేసినట్లు వివరించారు.

పెన్నహోబిలం పురాతన ఐరన్ బ్రిడ్జి పరిశీలన


బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, జేసీ కేతన్‌గార్గ్

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబలం వద్ద ఉన్న వందేళ్ల నాటి పురాతన ఐరన్ బ్రిడ్జిని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన బ్రిడ్జిని జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నిర్మించారు. దీంతో ఈ వంతెకు సంబంధించిన ఇనుప సామగ్రిని మరో స్థానంలో వంతెన నిర్మాణంలో పునః వినియోగానికి అనుకూలంగా ఉందా? లేదా? అనే అంశంపై నిపుణులతో చర్చించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఎన్‌హెచ్ ఈఈ మధుసూదన్, తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక జాషువా

- ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం కల్చరల్: ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహాకవి గుర్రం జాషువా జీవితం ఆదర్శప్రాయమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న జాషువా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ రంగయ్య విచ్చేసి, మాట్లాడారు. మేయర్ వాసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ కవులు ఏలూరు యంగన్న , తరిమెల అమరనాథ రెడ్డి, ఆచార్య బాల సుబ్రమణ్యం, సాహిత్య పీఠం ప్రతినిధులు డాక్టర్ ఎస్.రంగస్వామి, నాగలింగయ్య, పూజారి ఈరన్న, నానీల నాగేంద్ర, కవులు నబీరసూల్, జూటూరు షరీఫ్, మహాబోధి కృష్ణమూర్తి, రియాజుద్దీన్, విప్లవ గాయకుడు దాసరి ఆదినారాయణ తదితరులు జాషువాకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజాన్ని చైతన్య పరిచిన గుర్రం జాషువా రచనలు నేటికీ ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం ఆయన రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గొప్ప అభ్యుదయ, మానవతావాది ఆయన సాగించిన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. జాషువా కలలు కన్న సమసమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమం తప్పకుండా జాషువా జయంతి, వర్ధంతులను నిర్వహిస్తున్న సాహిత్య పీఠం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో డీవైఈఓ వెంకటరమణనాయక్, బోస్, అధ్యాపక సిబ్బంది డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ యోగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.


గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎంపీ తలారి రంగయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం

'చీనీ'ని దెబ్బతీస్తున్న 'పొలుసు'

- నివారించుకోవాలన్న డీహెచ్‌ఓ చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల చీనీ తోటల్లో పొలుసు పురుగు ఉధృతంగా వ్యాపిస్తోందని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టకపోతే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుందని శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ అధికారి (డీహెచ్‌ఓ) జి.చంద్రశేఖర్ సూచించారు. రెండు జిల్లాల పరిధిలో 50 వేల హెక్టార్లకు పైబడి చీనీతోటలు సాగులో ఉన్నందున పొలుసు పురుగుపై అప్రమత్తంగా ఉండాలని రైతులను హెచ్చరించారు. ఈ పురుగు కాండంపై ఏర్పడి రసం పీల్చడం వల్ల బంకలా మారి చివరకు చెట్లు చనిపోతాయన్నారు.

నివారణ చర్యలు:

- పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా పంట కోత పూర్తయిన వెంటనే కత్తిరింపులు చేపట్టి గాలీవెలుతురు ప్రసరించేలా చూడాలి.
- కొమ్మ కత్తిరింపులు తర్వాత లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చెట్టు కాండంపై ఏర్పడిన బంకను కత్తితో గోకిన తర్వాత మైలుతుత్తు సున్నం పేస్టును పూయాలి.
- పురుగు తీవ్రత ఎక్కువగా ఉంటే తొలుత ఒక లీటర్ నీటికి ఏదైనా షాంపు 3 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. మరుసటి రోజు తప్పనిసరిగా ఒక లీటర్ నీటికి 2 మి.లీ పిఫ్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి. తిరిగి 10 నుంచి 15 రోజుల మధ్యలో మరోసారి ఇదే మందును పిచికారీ చేసుకుంటే పొలుసు పురుగును సమర్థవంతగా నివారించుకోవచ్చు.


పొలుసు పురుగు కారణంగా దెబ్బతింటున్న చెట్టు కాండం

వేడి చారులో పడి చిన్నారికి తీవ్ర గాయాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని పోలేపల్లికి చెందిన వడ్డే కావేరమ్మ, మంజు దంపతుల రెండేళ్ల వయసున్న కుమారుడు గోవర్ధన్ ప్రమాదవశాత్తు వేడి చారు (రసం)లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.


గోవర్ధన్

PUBLIC NOTICE

This is the General Public notice that, my clients **1.DVN Infra Developers Pvt Ltd,** office at No.T-13, TF-1303, Raintree Boelvard Apartments. Byatarayanapura, Bellery Road, Bangalore-92, rep by Authorised Signatory Sri.D.V.Naidu S/o. D.Govindappa and **2.Reyansh Developers,** office at No.6-82-12, Sreesaila Nagar, Ananthapur, Andrapradesh-5015004, rep by Managing Partner Smt. Gudiputi Amrutha W/o. Sri.Gudiputi Chandrashekar, are intending to purchase the below mentioned schedule property from Mr.A.M.Nisar Syed S/o. Late. Syed Khundmir, represented by his GPA Holder M/s.Ennarveekay Ventures Private Limited, Represented by its authorized signatory Mr. Deepak M.S, having office at No. 8, 3rd floor, 3rd main Road, Opposite Rajajinagara IT Park, KSSIDC, Rajajnagara Industrial Estate Bangalore-560010, who represents to be the absolute owner in possession and enjoyment of the residentially converted land bearing Sy No.37, measuring 3 acres 2 guntas (out of 4 acre 14 guntas excluding 3 guntas Karab), vide Official Memorandum bearing No.ALN.SR.169/2004-05, dated 21.01.2005, situated at Chikkasanne Village, Kasaba Hobli, Devanahalli Taluk, Bangalore Rural District, which is referred to schedule property, free from all encumbrances. Any person/s objecting for the said sale or asserting any claim, right, title, interest in the above mentioned property or any part thereof, any manner, may put forth his/there claim/s in writing to the undersigned, **within Ten days** from the date of publication of this Notice along with documentary proofs, after which period my clients, shall proceed accordingly. Note that, is no claims or objection are received intime, then my clients shall proceed with the execution of the sale Agreement on the basis that there are no subsisting claim or right over the schedule property come whomsoever.

SCHEDULE PROPERTY

All that piece and parcel of residentially converted land bearing Sy No.37, measuring 3 acres 2 guntas (out of 4 acre 14 guntas excluding 3 guntas Karab), vide Official Memorandum bearing No.ALN.SR.169/2004-05, dated 21.01.2005, situated at Chikkasanne Village, Kasaba Hobli, Devanahalli Taluk, Bangalore Rural District and bounded on: **East By:** Sy No.36 (Property of Govindappa and Vajarappa) **West By:** Sy No.38 (Property of Chinnswamappa) **North By:** Road and Remaining portion of Survey No.37 **South By:** Lake Bed

NATARAJA Bsc.LLB., ADVOCATE & LEGAL CONSULTANT
No.23, 1st Floor, Sonnegowda Complex, Kodigehalli Main Road, Bangalore-560092. (M) 9845874124. Email: natarajakothanoor@gmail.com

సీఎస్‌ఓ కృష్ణారెడ్డి అరెస్ట్

- కసాపురంలో హుండీ నగదు చోరీ కేసులో ప్రధాన నిందితుడు
- రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని హుండీ నుంచి నగదు చోరీ చేసిన కేసులో పరారీలో ఉన్న ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌ఓ) కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే ఆలయంలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఓ అర్చకుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వివరాలను గురువారం సాయంత్రం గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్‌ఐ గోపాలుడుతో కలసి డీఎస్పీ నర్శింగప్ప వెల్లడించారు. ఈ నెల 17న వేకువ జామున హుండీలోకి కృష్ణారెడ్డి చేతులు పెట్టి నగదు చోరీ చేస్తూ సీసీ కెమెరాలకు పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఘటనపై ఆలయ అధికారులు ఫిర్యాదు మేరకు ఈ నెల 18న కేసు నమోదు చేసిన, పోలీసులు కృష్ణారెడ్డితో పాటు అదే రోజు హుండీలో నగదు చోరీ చేసేందుకు యత్నించిన అర్చకుడు దేశికాచారి గాలింపు చేపట్టారు. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న దేశికాచారిని బుగ్గసంగమేశ్వర ఆలయం వద్ద బుధవారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు కృష్ణారెడ్డి గురువారం సాయంత్రం గుంతకల్లు పట్టణ శివారులోని బళ్లారి రోడ్డులో ఉన్న లక్కీ దాబా వద్ద సంచరిస్తుండగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడి నుంచి రూ.13 వేలు స్వాధీనం చేసుకున్నారు. 2003లో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరిన కృష్ణారెడ్డి తర్వాత సెక్యూరిటీ ఏజెన్సీలను ఏర్పాటు చేసి ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్థాయికి ఎదిగాడు. స్వామి దర్శనార్థం కసాపురం వచ్చే ఓ భక్తురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించేందుకు యత్నించిన కృష్ణారెడ్డిపై గతంలోనే పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆలయ సెక్యూరిటీ బాధ్యతల నుంచి తప్పించలేకపోయారు. ఈ క్రమంలో హుండీ కానుకలను అపహరించేందుకు ప్రయత్నించి నిఘా కెమెరాలకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడం గమనార్హం. హుండీలో నగదు చోరీ కేసులో కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి, పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు 'పురం' విద్యార్థి


మెమెంటో అందుకుంటున్న విద్యార్థి మిథున్

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ధర్మవరంలో ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగం పోటీలు జరిగాయి. ఇందులో భాగంగానే పట్టణానికి చెందిన విద్యార్థి మిథున్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకృష్ణ, చెస్ కోచ్ ఆరీఫుల్లా తెలిపారు. మిథున్ 7 గేములకు గాను 6 గేముల్లో విజయం సాధించడంతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అక్టోబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మిథున్ పాల్గొంటారని పేర్కొన్నారు.

1న సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: సీనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అనంతపురం జిల్లా పురుషుల, మహిళల జట్లకు సంబంధించి అక్టోబర్ 1న అనంతపురంలోని ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్వీ హర్షవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో జరుగుతాయన్నారు. వివరాలకు 9849553603లో సంప్రదించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం: అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాలు...అందిన ముందస్తు సమాచారంతో సెబ్ ఏఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు ఇంటిలిజెన్స్ సీఐ నరసానాయుడు, సెబ్ సిబ్బంది కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి వద్ద గురువారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారు (ఏపీ02 సీహెచ్ 7582)ను ఆపి తనిఖీ చేయగా, రెండు బాక్సుల ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ (96 సీసాలు), 6 బాక్సుల్లో 72 నాక్ అవుట్ బీరు బాటిళ్లు బయటపడ్డాయి. కర్ణాటక నుంచి వీటిని అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. మద్యం తరలిస్తున్న తిమ్మసముద్రం నివాసి ఎరికల రవీంద్ర అలియాస్ రాజు, పాలవాయి గ్రామానికి చెందిన సుగాలీ గోవర్ధన్ నాయక్‌ను అరెస్ట్ చేశారు. వీరితో పాటు ఉన్న సుగాలీ సిద్ధునాయక్ పరారయ్యాడు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు రూ.38 వేలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

రామగిరి: రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఓ కంటైనర్ బుధవారం రాత్రి ఎస్‌ఎస్‌గేట్ సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కన డ్రైవర్ ఆపి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కర్నూలు జిల్లా ఆదోని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు 34 మంది ప్రయాణికులను తీసుకెళుతున్న డ్రైవర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో పది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న రామగిరి ఎస్‌ఐ జనార్దననాయుడు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: ఉమ్మడి జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్–14 బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా టెన్నిస్ క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. బాలుర జట్టుకు మోక్షిత్, అన్నీస్, తనోజ్, నిఖిత్, లిఖిత్, నవీన్, హార్దిక్, శశాంక్, భవదీప్, చైతన్య, తేజేశ్వర్, నేహాల్, విలాస్, మహిదర్, రిత్విక్, అభయకుమార్, జితేంధర్, శ్రీచరణ్, పార్థు, పరమేష్, హరీష్ జునైద్, రఘునందన్, ప్రణీత, యశ్వంత్ నాయక్, అఫ్జల్, కులదీప్‌నాయక్, షాకీర్, గోహన్, జశ్వంత్, పూజిత్, ప్రేమ్ చరణ్, భాను వర్ధన్, పవన్, విన్సెంట్, మోహిత్, ధ్రువ, తేజనాథ్, చారిత్, నేహన్ హంజా, సాయి చరణ్, ప్రణీత్ నాయుడు, భాను, వెంకట కృష్ణ ఎంపిక కాగా, బాలికల జట్టులో సిద్ధిక్ష, కార్తీక, లాస్య, గీత, సుకాంశ, అనుదీప, రాజేశ్వరి, హబీదా, షాహీదా, శిరీష, రెహన, చాందిని, అభినేత్రి, నవదీప చోటు దక్కించుకున్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ కార్యక్రమాలు


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయవాదులు

అనంతపురం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అపరిశుభ్రత అనేది అనేక వ్యాధులకు కారణమవుతుందన్నారు. మంచి పరిసరాలు మంచి ఆలోచనలకు దోహదపడతాయని, మానసిక, శారీరక, దృఢమైన సమాజం ఏర్పాటుకు పరిశుభ్రమైన వాతావరణం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులను, కోర్టు సిబ్బంది, నగర పాలక సంస్థ అధికారులను ప్రశంసించారు.

బిడ్డతో సహా చెరువులో దూకిన తల్లి

- చిన్నారి మృతి

తలుపుల: మండల కేంద్రంలోని బలిజపేటకు చెందిన చాకలి నాగమణి, తన 19 నెలల వయసున్న కుమారుడు చంద్రశేఖర్‌తో కలసి మాడికవాండ్లపల్లి గ్రామ సమీపంలోని ఎర్ర చెరువులో గురువారం దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడికి సమీపంలోనే బర్రెలు మేపుతున్న వారు గమనించి కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి, అక్కడకు చేరుకునే లోపు చిన్నారి గల్లంతయ్యాడు. నాగమణిని వెలికి తీసి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. కానిస్టేబుల్ ఈశ్వర్ నాయక్ చెరువులోకి దూకి లోతట్టు ప్రాంతం నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీసుకువచ్చాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మృతి చెందిన చిన్నారి చంద్రశేఖర్

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా అనంత పద్మనాభస్వామి వ్రతం


గాజుల అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారు

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీకాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో అనంత పద్మనాభ స్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతనంగా ప్రతిష్టించిన కొల్హాపురి మహాలక్ష్మికి ప్రత్యేక గాజులతో అలంకరించి, భక్తులకు వితరణ చేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు విజయ్‌కుమార్ నేతృత్వంలో అభిషేకాలు, అలంకార సేవలు మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం, అన్న ప్రసాద వితరణ జరిగాయి.

1న ఆదియోధుడు పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రాసాని రాసిన ఆదియోధుడు పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఉంటుందని సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

లఘు చిత్రాలకు ఆదరణ


కెమెరా స్విచ్‌ఆన్ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: మంచి సందేశాన్నిచ్చే లఘు చిత్రాలకూ మంచి ఆదరణ లభిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. గురువారం అనంతపురం సప్తగిరి సర్కిల్ లోని గీతా మందిరంలో ఎన్ఎస్ఎం వర్మ దర్శకత్వంలో రమేష్, బ్రహ్మ నిర్మాణ సారథ్యంలో రూపొందిస్తున్న ఎనీ పర్సన్ ప్రొటెక్టర్ (ఏపీపీ) అనే లఘు చిత్రాన్ని బోయ గిరిజమ్మ కెమెరా స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారన్నారు. ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలయ్యాక, బంధాలు, అనుబంధాలు పలుచనైపోతున్నాయన్నారు. అనంతపురంలో చిత్ర బృందాన్ని ఆమె అభినందించారు.

'కత్తిమండ' సేవలు ఎనలేనివి

అనంతపురం కల్చరల్: కత్తిమండ ప్రతాప్ సేవలు ఎనలేనివని వక్తలు అన్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం అందుకున్న కత్తిమండ ప్రతాప్ అభినందన సభ స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో గురు వారం జరిగింది. సాహితీవేత్తలు న్యాయవాది సాకే నరేష్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, కాకర్ల నాగేంద్రకుమార్, కుంచె చింతా లక్ష్మీనారాయణ, ఈరన్న తదితరులు మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్‌గా ఆయన అన్ని ప్రాంతాల్లోనూ కమిటీలను ఏర్పాటు చేసి, గుర్రం జాషువా, బోయిభీమన్నల సాహిత్యానికి విస్తృత ప్రచారం చేస్తున్నారని అన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

యాడికి: ఇరు వర్గాల ఘర్షణలో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నగరూరు గ్రామంలో గురువారం సాయంత్రం లక్కు రామాంజనేయులుకు చెందిన ఇంటి గోడ రాళ్లు లక్కు వీరన్న తీసుకుపోతుండటంతో రామాంజనేయులు అడ్డు చెప్పాడు. ఈక్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వీరన్న, లక్ష్మిదేవి, గంగరత్నమ్మ, నీలకంఠ, లక్ష్మిదేవి, జయమ్మ, రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

- ర్యాలీకి భారీగా తరలి వచ్చిన ముస్లింలు
- ప్రత్యేక ఆకర్షణగా 1000 అడుగుల పతాకం


ఆత్మకూరులో పండుగ వాతావరణంలో చిన్నారులు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు


నగరంలో ర్యాలీ చేస్తున్న మేయర్ వసీం సలీం, నదీమ్ అహ్మద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వాన్ ముస్లింలు


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: జిల్లా వ్యాప్తంగా మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ప్రతి మసీదు, మదర్సాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చి, శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో పాతూరు ఆసార్ దర్గాతో పాటు బహవుద్దీన్ మసీద్, చాందియా మసీదు, జామియా మసీదుల నుంచి భారీగా తరలిరావడంతో నగర వీధులు జనసంద్రంగా మారాయి. చిన్నారులు కూడా ఖురాన్ సూక్తులను, భక్తిగీతాలను ఆలపిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. గుర్రాలపై ఎక్కి జెండాలు పట్టుకొని మిలాద్ ఉన్ నబీ నినాదాలు చేశారు. మొదటిరోడ్డు మసీదు ఆధ్వర్యంలో నగరమంతటా తిరుగుతూ ప్రదర్శించిన 1000 అడుగుల ఖురాన్ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు శాంతి ర్యాలీకి సంఘీభావం తెలిపి, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి కోసమే ఇస్లాం:

ర్యాలీలకు ముందు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. మతపెద్దలు మిలాద్ ఉన్ నబీ సందేశం ఇచ్చారు. దీన్-ఇ-జల్సా పేరిట ప్రవక్త ఆదర్శ జీవితాన్ని చాటే మిలాద్ ఉన్ నబీ శాంతిని బోధిస్తుందన్నారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను ఆచరించడం ద్వారా లోక కల్యాణానికి అందరూ పాటుపడాలని సూచించారు. శాంతి ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం షర్బత్తులను వితరణ చేశారు. పలు చోట్ల అన్నదానాలు జరిగాయి.

జమాతే ఇస్లామీ హింద్ వైద్య శిబిరం

మిలాద్ ఉన్ నబీ సర్వదినం సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ , ఐడియల్ యూత్ మూమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థల కార్యాలయాల్లో డాక్టర్ జానకీ అరవిందకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మహిళా విభాగం నేతృత్వంలో పలు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. జమాతే నగర అధ్యక్షుడు నవాజ్ అహ్మద్, కార్యదర్శి హీజీ పీరా, ఫిరోజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు అఖిలా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు


ఆత్మకూరు: మండల కేంద్రంలో గురువారం భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని నూతన వస్త్రాలు ధరించి మసీదు వద్ద ట్రాక్టర్‌లో చాందినినీ ప్రత్యేక పూలతో అలంకరించి, ఊరేగింపుగా సయ్యద్ సర్దార్‌వలి దర్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుసుకొని నమాజ్ చేసుకున్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయం

అనంతపురం సిటీ: మహమ్మద్ ప్రవక్త జీవితం అనుసరణీయమని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని కమలానగర్‌కు చెందిన బాబాజీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరుణామయుడైన అల్లాహ్ సర్వ మానవాళి శ్రేయస్సు, శాంతి నెలకొల్పడానికి ఆఖరి ప్రవక్తగా మహమ్మద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పవిత్ర కేశ దర్శనంతో పునీతం

మహమద్ ప్రవక్త కేశ దర్శనానికి పెద్ద ఎత్తున తరలిరావడంతో నగరంలోని మసీదులు, దర్గాలు కిటకిటలాడాయి. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పాతూరులోని ఆసార్ దర్గా, మాసుమాబీ దర్గా, రెండో రోడ్డులోని బహువుద్దీన్ మసీదు, శాంతి నగర్‌లోని ఆస్థానీ ఔలియా తదితర చోట్ల ప్రవక్త కేశాన్ని దర్శనార్థం ప్రదర్శించారు. జనం బారులుదీరి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవిత్ర కేశాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా చదివింపులు చేసిన ప్రసాదంతో పాటు అన్నదానాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేశ దర్శనం ఏర్పాటు చేసిన మసీదులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు.


మాసుమాబీ దర్గాలో మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనం


బహువుద్దీన్ మసీదులో కేశ దర్శనం చేసుకుంటున్న ముస్లింలు


రెండోరోడ్డు బహువుద్దీన్ మసీదు వద్ద జెండాలతో ర్యాలీలో ముస్లింలు




మాసుమా దర్గాలో ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం ప్రార్థనలు


ఆత్మకూరులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు


600 మీటర్ల జెండాతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు


కేశ దర్శనం కోసం బారులుదీరిన ముస్లిం మహిళలు

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం


రాధమ్మ


పూజారి లక్ష్మీ నరసింహులు


జూటూరు శేఖర్


గంగిరెడ్డి గారి నర్సిరెడ్డి


మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి


కర్రా హనుమంతరెడ్డి

- ఇద్దరు పాతవారు, నాలుగు మండలాల్లో కొత్తవారికి అవకాశం

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లను నియమించింది. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు. రాప్తాడు, కనగానపల్లి మండలాల్లో పాతవారికే అవకాశం కల్పించగా, నాలుగు మండలాలకు కొత్తవారిని నియమించారు. అనంతపురం రూరల్ మండల కన్వీనర్‌గా కక్కలపల్లికాలనీ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కె.రాధమ్మ, ఆత్మకూరు మండల కన్వీనర్‌గా పూజారి లక్ష్మీనరసింహులు, రాప్తాడు మండల కన్వీనర్‌గా జూటూరు శేఖర్, చెన్నేకొత్తపల్లి మండల కన్వీనర్‌గా గంగిరెడ్డి గారి నర్సిరెడ్డి, కనగానపల్లి మండల కన్వీనర్‌గా మామిళ్లపల్లి అమర్నాథ్‌రెడ్డి, రామగిరి మండల కన్వీనర్‌గా కర్రా హనుమంతరెడ్డిని నియమించారు.

పార్టీకోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ..

కొత్తగా నియామకమైన మండల కన్వీనర్లను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అభినందించారు. ఆయా మండలాల్లోని గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొనిపోతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. చురుగ్గా పనిచేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు.

ఘనంగా పూర్వాభాద్ర హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకొని హోమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమాన్ని నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గుర్రం జాషువా సాహితీ సేవలు స్ఫూర్తిదాయకం

- జిల్లా ఎస్పీ అన్బురాజన్


గుర్రం జాషువా చిత్రపటానికి వందనం చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: గుర్రం జాషువా సాహితీ సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జాషువా కవిత్వాన్నే ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై యుద్ధం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారన్నారు. ఈయన సేవలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ తదితర ఎన్నో పురస్కారాలు ప్రదానం చేసినట్లు తెలిపారు. అదనపు ఎస్పీలు ఆర్‌వీజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు (ఏఆర్), ప్రసాద్‌రెడ్డి, ఏడీఆర్ డీఎస్పీ మునిరాజ్, సెబ్ సీఐ ఇందిర, టూటౌన్ సీఐ శివరాముడు, ఆర్ఐ రాముడు, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి తీరని లోటు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, చిత్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: వ్యవసాయ శాస్త్రవేత్త, రైతు సంక్షేమ సిఫార్సుల ప్రదాత ఎంఎస్ స్వామినాథన్ మృతి సమాజానికి తీరనిలోటని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. స్వామినాథన్ గురువారం మరణించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. గేయానంద్‌తో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎంబాషా పాల్గొన్నారు. స్వామినాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ భారతదేశ హరిత విప్లవ పితామహుడని కొనియాడారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు విశేష కృషి చేశారన్నారు. వ్యవసాయాభివృద్ధికి ఆయన సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలోవిశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఉమామహేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సావిత్రి, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

అనంతపురం అర్బన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కె.నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక వీకేమెమోరియల్ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ప్రాంతీయ సదస్సు జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు ప్రమాదకరమైన, రిస్క్‌తో కూడిన పనులు చేస్తూ ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం అయినా ఇంజనీరింగ్ కార్మికుల శ్రమను గుర్తించి, వారికి హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు.


నూతన కమిటీ ఎన్నిక: సదస్సు అనంతరం జిల్లా ఇంజనీరింగ్ కార్మికుల నూతన కమిటీ 32 మంది సభ్యులతో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా సంజీవరాయుడు, కోశాధికారిగా రామాంజనేయులును ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పాతూరు సీడీ ఆస్పత్రికి మహర్దశ

- రూ.11.02 కోట్లతో నూతన భవనం
- పేద ప్రజలకు అధునాతన వైద్యసేవలు
- సీడీ ఆస్పత్రిని ప్రారంభించనున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత



పాతూరులో కొత్తగా నిర్మించిన చెస్ట్ ఆస్పత్రి


పాతూరులో పాత భవనంలోనే చికిత్సల కోసం వచ్చిన రోగులు

అనంతపురం మెడికల్: నగరంలోని రాణీనగర్, మున్నానగర్, రాజమ్మ కాలనీ, అంబేడ్కర్‌నగర్, వినాయకనగర్, భాగ్యనగర్, తదితర పాతూరు ప్రాంతాల్లోని 30 వేల మంది ప్రజలకు ఆ ఆస్పత్రే దిక్కు. జిల్లాకేంద్రానికి చుట్టుపక్కలున్న గ్రామాల ప్రజలు కూడా ఆస్పత్రిలో చికిత్సకోసం వస్తారు. పాతూరు సీడీ ఆస్పత్రి (ఛాతీ వ్యాధుల ఆస్పత్రి) అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వం, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నాబార్డు నిధులు రూ.11.02 కోట్లతో పాతూరు చెస్ట్ డిసీస్ (సీడీ) ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనంత, ఎంపీ రంగయ్య ప్రారంభించనున్నారు.

మూడు బ్లాకుల్లో సేవలు:

జీప్లస్ 1 భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ట్రయాజ్, పసికందుల సేవలు, అల్ట్రాసౌండ్ స్కానర్, ఈసీజీ సేవలు, ఏఆర్‌టీ సెంటర్, ఐసీటీసీ క్లీనిక్, పీపీటీసీ కౌన్సెలింగ్, ల్యాబ్ ఎక్స్‌రే, పీడియాట్రిక్, సర్జికల్ ఓపీ, గైనిక్ ఓపీ, ఓబీజీ, రక్తపరీక్షలు, ఫస్ట్ ఫ్లోర్‌లో పోస్టు ఆపరేటివ్, ఆరు ఐసీయూ మంచాలు, 12 యాంటినేటల్ మంచాలు, ఇన్ బార్న్, ఔట్‌బార్న్ యూనిట్, స్టెప్‌డౌన్, ల్యాబ్, తదితర వాటికి 12 పడకలు, మరో బ్లాక్‌లో బయో మెడికల్ వేస్ట్, డీజీ సెట్, అంబులెన్స్ గ్యారేజ్, యోగా హాల్, క్యాంటీన్, రోగులకు వేచి ఉండే షెడ్డుకు కేటాయించారు.

జనరల్ ఆస్పత్రి తరహాలో సేవలందించాలి

ప్రభుత్వ సర్వజనాస్పత్రి తరహాలో పాతూరు సీడీ ఆస్పత్రిలో సేవలందాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌ను ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాతూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కూలీ, నాలీ చేసుకొని జీవనం సాగించే వారున్నారని, వారందరికీ కార్పొరేట్ వైద్యం అందాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్‌తో పాటు మరో ఏడుగురు వైద్యులు ఉన్నారని, వారిలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు ఉన్నారని తెలిపారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

రాప్తాడురూరల్: అనంతపురం నగరానికి ఈనెల 30, అక్టోబరు 1న నీటి సరఫరా ఉండదని నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి నీరు సరఫరా చేసే కూడేరు మండలం ముద్దలాపురం వద్ద కొత్తగా నిర్మించిన 16 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టరేషన్ ప్లాంట్‌కు ఇంటర్ కనెక్షన్ల పనులు జరుగుతాయన్నారు. నగరవాసులు సహకరించాలని ఆయన కోరారు.